# “కార్పొరేట్లకు వరాలు – పేదలకు పన్నులు” – ఈ విధానమే తప్పు.

విశాఖ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు నగరాభివృద్ధి సమస్యలమీద చర్చిస్తున్నారని తెలిసింది. ఈ సందర్భంలో, క్రింద సూచించిన విషయాలగురించి మనం అందరం ఆలోచించవలసిన అవసరం ఉంది.

విశాఖ నగరం రోజురోజుకు విస్తీర్ణం దృష్ట్యా, జనాభా దృష్ట్యా అతి వేగంగా పెరుగుతున్న నగరం. అటువంటి పెరుగుదలకు అనుగుణంగా సమస్యలకు పరిష్కారాలు కనిపించడం లేదు. ఇందుకు ముఖ్యమైన కారణం. ప్రభుత్వం, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజల అభిప్రాయాలను సేకరించి ప్రజల తరఫున సమస్యలను పరిశీలించకపోవడం.

రాజ్యాంగంలో మునిసిపాలిటీలకు ప్రజాస్వామ్య వ్యవస్థలుగా ప్రత్యేకమైన ప్రాధాన్యత ఇవ్వబడినా, ఏళ్ల తరబడి జివిఎంసీ కు ఎన్నికలు జరగలేదు. అలాగే వార్డు కమిటీలను , ఏరియా సభలను ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన ప్రణాళికల మీద ఆ వ్యవస్థల ద్వారా ప్రజలు పర్యవేక్షణ చేయాలని, రాష్ట్రప్రభుత్వం కొన్ని సంవత్సరాల క్రింద చట్టాన్ని తీసుకువచ్చినా ఆవ్యవస్థలు ఈరోజువరకు ఏర్పాటుచేయబడలేదు. ఈ విషయాల మీద ప్రజలలో చర్చ జరగాలి. ప్రజలు ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలి.

విశాఖ కార్పొరేషన్ కు ఎన్నికలు జరిగి సుమారు ఒకసంవత్సరం అయ్యింది. కార్పొరేషన్ కౌన్సిల్ ముందు కూలంకషంగా చర్చ జరగకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ఆస్తిపన్ను ను నిర్ణయించే విధానాన్ని మార్చడం సబబుగా లేదు. ఆస్తిపన్ను ఆస్తి మీద వచ్చే ఆదాయం ఆధారంగా నిర్ణయించబడాలి కాని, ప్రభుత్వం ప్రజల సమ్మతి లేకుండా నోటిఫై చేసిన ఆస్తి విలువ ఆధారంగా నిర్ణయించబడ కూడదు. ఈ విషయం మీద చర్చ జరగాలి. జివిఎంసీ కార్పొటటర్లు వారి వారి పార్టీల అభిప్రాయాలు కాకుండా, ప్రజల ఉద్దేశాలను అర్థం చేసుకుని ప్రజల తరఫున పని చేయాలి

విశాఖ ప్రజలకు నీటి సరఫరా సౌకర్యం సరిగా లేదు. జలాశయాల్లో నీటి నిలువలు తగ్గుతున్నాయి. నీటిలో కాలుష్యం పెరుగుతున్నది. భూగర్భ జల వనరులు క్షీణించడమే కాకుండా కాలుష్యానికి గురి అవుతున్నాయి. ఇందువలన, మరియు, పోర్టు, పరిశ్రమలు, ట్రాఫిక్ వల్ల గాలిలో వచ్చే కాలుష్యం వలన ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతుంది. సముద్ర జలాలు కూడా కాలుష్యానికి గురి అవ్వడం వలన, మత్స్యసంపద తగ్గడమే కాకుండా, తినే చేపలద్వారా కూడా ప్రజల ఆరోగ్యానికి నష్టం కలుగుతున్నది. ఈ విషయాలను చర్చించి కార్పొరేషన్ దృష్టికి తీసుకురావాలి. నగరంలో ఒకవైపు బ్యూటిఫికేషన్ పేరులో జివిఎంసీ దుబారా ఖర్చులు చేస్తూ. మురికివాడల సంక్షేమం మీద ఖర్చుపెట్టవలసిన 40% నిధులను పూర్తిగా ఉపయోగించడం లేదు. జివిఎంసీ బడ్జెట్లో ఖర్చుపెట్టే ప్రతి రూపాయకు ప్రజలకు జవ్వాబుదారీ గా ఉండాలి. ఈవిషయంలో కార్పొరేటర్లు ప్రజల తరఫున కంఠం వినిపించాలి.

రాజ్యాంగంలో సూచించిన విధంగా జివిఎంసీకు పార్కులను మైంటైన్ చేసే బాధ్యత ఉంది. పబ్లిక్ పార్కులను ఉపయోగించడంలో ప్రజల వద్దనుండి ఫీజు చార్జ్ చేయకూడదు. అయినా ఓల్డ్ సెంట్రల్ జైలు స్థలంలో ఉన్న పార్కుకు అధికంగా ఫీజు చార్జ్ చేస్తున్నారు. అది సబబు కాదు. గంగవరం పోర్టు, హిందుజా పవర్ ప్లాంట్ వంటి ప్రైవేట్ కంపెనీలకు జివిఎంసీ ఆస్తి

పన్ను నుంచి మినహాయింపు ఇవ్వడం కూడా సరికాదు. అటువంటి లాభాలు గణించే కంపెనీ వద్ద నుంచి పన్నులు సేకరించి, సామాన్య ప్రజానీకానికి ఫ్రీ గా సౌకర్యాలు కలిగించాలని ప్రజలు డిమాండ్ చేయాలి.

సెమినారులో చర్చల ద్వారా మీరు జీవీఎంసీ కు, ఇతర స్థానిక వ్యవస్థలకు మంచి సలహాలను ఇస్తారనడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఈ అ స శర్మ** 2-6-2022